విస్తరిస్తున్న క్షయ



- ఏటా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- మందులు క్రమంగా వాడితే వ్యాధి నయమవుతుందంటున్న వైద్యులు



గళ్ల పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలో క్షయ రోగుల సంఖ్య పెరుగుతోంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం, చెడు అలవాట్ల సంఖ్య కారణంగా బాధితుల సంఖ్య అధికమవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో భారీ పరిశ్రమలతోపాటు కడప స్లాబ్ యూనిట్లు, గ్రానైట్ యూనిట్లు, చిన్న చితక యూనిట్లు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే అధికంగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటోంది. వీరిలో ఎక్కువ మందికి ధూమపానం, మద్యపానం, గుట్కాలను నమలడం అలవాటుగా ఉంటోంది. మిగిలిన వారికి కంటే ఇలాంటి వారికి ఎక్కువగా క్షయ సోకుతుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో 2023లో 487 మంది బాధితులుండగా గతేడాది ఆ సంఖ్య కాస్త 533కు చేరింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ 50కి పైగా బాధితులను గుర్తించారు.

క్షయ లక్షణాలిలా..

మైక్రో బ్యాక్టీరియా క్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వ్యాధి వ్యాపిస్తుంది. ఎడతెరిపి లేకుండా రెండు వారాలకు మించి దగ్గు రావడం, విపరీతమైన జ్వరం రావడం, ఆకలి మందగించడం, ఛాతిలోనొప్పి రావడం, గాలి ద్వారా ఇతరులకు క్షయ వ్యాపిస్తుంది. క్షయ వ్యాధి గ్రస్తులు దగ్గినా, తుమ్మిన వచ్చే తుంపర్ల వల్ల వ్యాధి ఇతరులకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధి 35 నుంచి 50 ఏళ్లలోపు వారికి ఎక్కువ వస్తుంది. అందులోనూ ఊపిరితిత్తులు, గర్భాశయం, చర్మం, కళ్లు తదితర వాటికి వ్యాధి సోకుతుంది. మధుమేహం, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, పౌష్టికాహార లోపం, రక్తహీనత ఉన్నవారిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది.

జగన్ ప్రభుత్వంలో రూ.1000కు పెంపు

ఉచితంగా మందులతో పాటు క్షయ వ్యాధిగ్రస్తులకు పెరిగిన ధరలకు అనుగుణంగా పౌష్టికాహారం కోసం జగన్ ప్రభుత్వం ఆర్థిక సాయం రూ.1000కు పెంచింది. గతంలో కేవలం రూ.500 ఉండగా రెండింతలు పెంచింది. మందులను వాడటంతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్షయను అదుపులోకి తీసుకురావచ్చన్న ఆలోచనతో జగన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సాయాన్ని రూ.రెండు వేలకు పెంచాలని రోగులు కోరుతున్నారు.

మండలాల వారీగా క్షయ రోగుల సంఖ్య

మండలం	2023 సంవత్సరం	2024 సంవత్సరం
తాడిపత్రి టౌన్	189	217
తాడిపత్రి మండలం	94	117
పెద్దపప్పూరు	54	40
యల్లనూరు	34	32
యాడికి	56	61
పుట్లూరు	60	66
మొత్తం	487	533



గళ్ల పరీక్ష కేంద్రం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం



100రోజుల ప్రోగ్రాం ద్వారా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాల ద్వారా క్షయపై ప్రజలకు చైతన్యం కలిగిస్తున్నాం. మద్యపానం, దూమపానం, గుట్కా తదితర వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నాం. క్షయ రోగులకు ఉచితంగా గళ్ల పరీక్షలతో పాటు మందులను ఇవ్వడంతో పాటు నెలకు రూ.1000 ఆర్థికసాయం అందిస్తున్నాం.

– సునీల్, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్, తాడిపత్రి

క్రైస్తవులు చేసిన తప్పేమిటి?

- చర్చిల అనుమతులపై రీసర్వే సబబు కాదు
- వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు



మాట్లాడుతున్న వైపీ బాబు, పాస్టర్లు

గుత్తి: రాష్ట్రంలోని క్రైస్తవులపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు ధ్వజమెత్తారు. పాస్టర్లతో కలసి గుత్తిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న చర్చిల అనుమతులపై వెంటనే రీసర్వే చేయాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జారీ చేసిన ఆదేశాలను ఆక్షేపించారు. దీనిపై కనీస ఆలోచన కూడా లేకుండా కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడం దుర్మార్గమన్నారు. చర్చిల అభివృద్ధికి తమ ప్రభుత్వం పాటు పడుతుందని స్వయంగా సీఎం చంద్రబాబు చెబుతూనే మరోవైపు చర్చిల అనుమతులపై రీసర్వే చేయాలని అధికారులకు డీసీఎం ఆదేశాలు జారీ చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. లౌకిక దేశంలో ఇలాంటి చర్యలు తామెన్నడూ చూడలేదన్నారు. కులమతాలు మరిచి అందరూ సహోదరభావంతో మెలుగుతున్నారని, ఇలాంటి తరుణంలో కులాలు, మతాల మధ్య చిచ్చు రేపేలా డీసీఎం పవన్ కళ్యాణ్ వ్యవహరిస్తుండడం, లౌకిక రాజ్యానికి భిన్నంగా జీఓలు జారీ చేయడం మంచిది కాదన్నారు. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బిషప్ వాసు అనిల్‌కాంత్, పాస్టర్లు అబ్రహాముయ్య, జాకోబ్, సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు



రోడ్డుపై బైఠాయించిన సీపీఎం, కాంగ్రెస్ నాయకులు

గుంతకల్లుటౌన్: స్థానిక 60 అడుగుల రోడ్డు బస్టాండ్‌కు సమీపంలోని మున్సిపల్ స్థలాల్లో చిన్న బంకులను ఏర్పాటు చేసుకుని జీవనాన్ని సాగిస్తున్న చిరువ్యాపారస్థుల పొట్టకొట్టాలని చూస్తే సహించేదిలేదని సీపీఎం, కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీ సాయంతో బంకులను తొలగించేందుకు అక్కడికి వెళ్లడంతో సీపీఎం, కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. అర్థాంతరంగా బంకులను తొలగిస్తే 20 కుటుంబాల పరిస్థితి ఏంటని అధికారులను నిలదీశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ససేమిరా అనడంతో ఆయా పార్టీల నాయకులు 2 గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసు అధికారులు జోక్యం చేసుకుని 15 రోజులు గడువు ఇప్పించడంతో వారు ఆందోళన విరమించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మహేంద్ర, నాయకులు నాగరాజు, రమేష్, జెన్నేమస్తాన్, సురేంద్ర, చిరువ్యాపారులు మల్లీశ్వరి పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయానికి కృషి

బుక్కరాయసముద్రం: రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉండేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కృషి చేయాలని రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. బుధవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో 43వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ కేవీకేల్లో జరుగుతున్న కార్యక్రమాలు రైతులకు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. 2024–25లో కేవీకేలో జరుగుతున్న కార్యక్రమాలపై చర్చించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల డీఏఓలు ఉమా మహేశ్వరమ్మ, వైవీ సుబ్బారావు, డీహెచ్ఓ నరసింహారావు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, పశుశాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్, ఆత్మా పీడీ మద్దిలేటి, నాబార్డ్ ఏజీఎం అనూరాధ, డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆఫీసర్ అరుణకుమారి, ఫిషరీస్ అధికారి శివక్రిష్ణ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, రెడ్డిపల్లి ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, రేకులకుంట వ్యసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, కళ్యాణదుర్గం కేవీకే కోఆర్డినేటర్ చంద్రాయుడు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ పర్యటించారు. శ్రీనివాసపురంలోని పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అభయాంజనేయ స్వామి విగ్రహం వద్దనున్న అన్న క్యాంటీన్‌కు వెళ్లి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



చుక్కలూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు కంటి అద్దాలు అందించిన మధుసూదనరాజు

తాడిపత్రి: మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు జీపీఎంఓ మధుసూదనరాజు తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మొత్తం 69 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె మురళీకృష్ణ, లక్ష్మీనరసింహులు, మహమ్మద్ గౌస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్: గాజువాకలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మహేంద్ర, మారుతి తృతీయస్థానాల్లో నిలిచారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు అభినందించారు. కామర్స్ విభాగపు అధిపతి డాక్టర్ జనార్దన్ శాస్త్రి, అధ్యాపకుడు రాఘవేంద్ర ప్రసాద్ ఒక్కో విద్యార్థికి రూ.1,500 చొప్పున నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సురేష్, అధ్యాపకులు బాలకృష్ణ, గోపినాయక్, నాగరాజు, నారాయణ, జాకీర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో అనర్థం



మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

గుత్తి రూరల్: వ్యర్థ పదార్థాలతో తయారు చేసిన నాటు సారాతో ఆరోగ్యానికి అనర్థం తప్పదని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఈఎస్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జక్కలచెరువు, బసినేపల్లి తండాలో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించి నాటుసారాతో జరిగే అనర్థాల గురించి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కళాజాతా బృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డీసీ మాట్లాడుతూ నాటుసారాతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు నిషేధించారన్నారు. ఎస్ఐ అస్లాంబేగ్, కార్యదర్శులు వెంకటేష్, ధనలక్ష్మి, సర్పంచ్ సుశీలమ్మ, ఎంపీటీసీ శంకరమ్మ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



మస్టర్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవు అని డ్వామా పీడీ సలీం బాషా హెచ్చరించారు. బుధవారం ఆయన దయ్యాలకుంటపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది కూలీలు ఉన్నారు, ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయని ఏపీఓ పోలేరయ్యను అడిగి తెలుసుకున్నారు. బీకేఎస్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారని, జాబ్ కార్డు ఉన్న వారందరూ 150 రోజులు పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు కుల్లాయస్వామి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

రాయితీపై పవర్ స్ప్రేయర్లు



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: రైతులకు రాయితీపై పవర్ స్ప్రేయర్లను అందిస్తామని డీఏఓ ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం దయ్యాలకుంటపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీతో పవర్ స్ప్రేయర్లను అందిస్తామని, త్వరలో విధివిధానాలు ఖరారవుతాయన్నారు. ప్రతి రైతుకు 11 అంకెల యూనిక్ ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఏఈఓ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన శింగనమల నేతలు



శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శింగనమలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, విద్యా మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

వైవీఆర్‌ను కలిసిన నాగేంద్ర



వైవీఆర్‌తో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

గుంతకల్లుటౌన్: సర్వైకల్ సర్జరీ చేయించుకుని హైదరాబాద్ నుంచి గుంతకల్లుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర పరామర్శించారు. బుధవారం వైవీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని, పండ్లు అందజేశారు. వైవీఆర్ ఆరోగ్య స్థితిని నాగేంద్ర అడిగి తెలుసుకున్నారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇటీవల జరిగిన సదస్సులో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సస్టైనబుల్ మెటీరియల్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఫర్ ఇండస్ట్రీస్ 5.0 (ఐసీఎంఎంఐ) ప్రథమ అంతర్జాతీయ సదస్సు జరిగిందన్నారు. ఇందులో ఎస్ఆర్ఐటీ కళాశాలకు చెందిన 35 మంది ఫైనల్ ఇయర్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 10 పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు. ఇవి స్కోపస్ ఇండెక్స్ జర్నల్స్‌లో ప్రచురించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే కళాశాలకు చెందిన లలిత్‌కుమార్‌కు ఉత్తమ పరిశోధనా పత్రం పురస్కారం లభించిందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డాక్టర్ చిన్నపుల్లయ్య అభినందించారు.

విద్యార్థులపై ఒత్తిడి తేవద్దు

తాడిపత్రిటౌన్: ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫీజుల విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తేవొద్దని ఎంఈఓ నాగరాజు, సీఐ శివగంగాధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎస్ఐ గౌస్‌బాషా, ఎంఈఓ రామగోవిందు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

పెద్దవడుగూరు : ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జెడ్పీహైస్కూల్ హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇటీవల సైన్స్ డేలో సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

బుక్కరాయసముద్రం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ఉరవకొండ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాయుడు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకట కొండ, శ్రీనివాసులు, సంజీవరెడ్డి, నారాయణస్వామి, వేణు, ఆదెప్ప జయరామిరెడ్డి, నారాయణరెడ్డి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడిపత్రి: తాడిపత్రి – చుక్కలూరు ప్రధాన రహదారిపై బుధవారం బైక్‌ను లారీ ఢీ కొన్న ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన మేకల శీన (35) చుక్కలూరు పారిశ్రామిక వాడలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం తన సెల్‌ఫోన్ బ్యాటరీ మార్చుకునేందుకు తన స్నేహితుడు రాఘవేంద్రతో కలసి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పెద్దమ్మ గుడి వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మేకల సూరి పరిస్థితి విషమించడంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. జరిగిన ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య బుజ్జమ్మ ముగ్గురు ఆడపిల్లలున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రైవేటపాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ వారికి పాఠశాలల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై మాసినేని పాఠశాల సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణానికి చెందిన రాము, మహేష్ బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

పుట్లూరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీపై సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గతేడాది రూ.11.22 కోట్లు పనులు చేపట్టగా వాటిపై తనిఖీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

శింగనమల: ఇరువెండల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పశుగ్రాసం దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు బాలగంగిరెడ్డి గొర్రెల మేపు కోసం ఇతర రైతుల వద్ద వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి గ్రామ శివారులో వామి వేశాడు. బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గ్రాసం మొత్తం కాలిబూడిదైంది. పక్కనే సాగులో ఉన్న వేరుశనగ పైరు కూడా దెబ్బతినింది. ఘటనలో రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

పామిడి: పీ కొత్తపల్లిలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు హరినాథ్‌రెడ్డి తన దొడ్డిలో ఏర్పాటు చేసుకున్న గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఘటనలో రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి కోరారు.

చలో విజయవాడకు తరలిరండి

శింగనమల: ఈనెల 12న కూలీల సమస్యలపై విజయవాడ తలపెట్టిన ధర్నాకు కూలీలు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. బుధవారం రాచేపల్లి, కల్లుమడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువైనందున ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

గార్లదిన్నె: ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు అందజేశారు.

ఆ సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

తాడిపత్రి రూరల్: నందలపాడు సచివాలయం–1లో పనిచేస్తున్న ఎడ్యుకేషన్ ఉద్యోగి సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ శివరామక్రిష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. సుధాకర్ ఈనెల 1న పింఛన్ల పంపిణీ చేపట్టాడు. దాదాపు 24 మంది లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకున్నాడు. కానీ వారితో వేలిముద్రలు పడలేదని, తరువాత వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం కర్ణాటకలోని బళ్లారికి చేరుకున్నాడు. ఈ విషయంపై తోటి ఉద్యోగులకు కూడా సమాచారం ఇవ్వలేదు. తన వద్ద ఉన్న పింఛన్ డబ్బు, వేలిముద్రల మిషన్ అప్పగించలేదు. రెండు రోజుల తర్వాత డబ్బు పంపిణీ చేయడం గమనార్హం. ఈ క్రమంలో కమిషనర్ ఆదేశాల మేరకు ఉద్యోగులు బాధితులను విచారించి.. నివేదికను ఆయనకు అందజేశారు. ఈ క్రమంలోనే సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

దొడ్డబళ్లాపురం: రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని రెండు లారీలు వరుసగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మరణించిన ఘటన కర్ణాటకలో చిత్రదుర్గ తాలూకా సీబార గ్రామం వద్ద 48వ హైవేలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ తాడిపత్రికి చెందిన డ్రైవర్ శేఖర్ (55), తమిళనాడు ధర్మపురికి చెందిన పెరియస్వామి (50), ఉత్తరప్రదేశ్ అలీగఢ్‌కు చెందిన జబరుద్దీన్ (52) మృతులు. వస్త్రాల లోడ్‌తో వెళ్తున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి టైర్ మారుస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన రెండు లారీలు దాన్ని ఢీకొట్టాయి. ఈ దుర్ఘటనలో మూడు లారీల డ్రైవర్లు గాయాలతో మరణించారు. ఓ లారీలోని కళింగర కాయలు చెల్లాచెదరుగా పడిపోయాయి. తాడిపత్రికి చెందిన లారీ డ్రైవర్ కళింగర కాయల లోడుతో వెళుతున్నట్లు తెలిసింది. చిత్రదుర్గ రూరల్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

ఇందిరమ్మ కాలనీలో వసతులు కల్పించాలి

గుంతకల్లు: దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ డీఈ కృష్ణమూర్తితో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ, మండల కార్యదర్శులు ఎస్.గోపీనాథ్, రాము రాయల్, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు సురేష్ కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమస్యలపై ఆరా తీశారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని డీఈ తెలిపారు. నాయకులు దాసరి శ్రీనివాసులు, మధు, నూర్‌బాషా పాల్గొన్నారు.